కాటసాని నాయకత్వంలో కల్లూరులో ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

- కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలి
- ఎఐ, క్వాంటం కంప్యూటింగ్‌తో కూడిన బోధన
- ఆర్‌యు స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్
- 75 మందికి గోల్డ్ మెడల్స్ అందజేత
- శాస్త్రవేత్త డాక్టర్ ఎస్ఎస్‌వి.రామకుమార్‌కు గౌరవ డాక్టరేట్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటిని చేరుకునేందుకు అడుగులు వేయాలని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ అబ్దుల్ నజీర్ సూచించారు. విద్యార్థులకు తప్పనిసరిగా కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాల ని కోరారు. బుధవారం రాయలసీమ విశ్వవిద్యాలయ నాల్గవ స్నాతకోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని ఓపెన్ ఆడిటోరియంలో జరిగిన ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా ఛాన్సలర్ హోదాలో డాక్టర్ అబ్దుల్ నజీర్ పాల్గొన్నారు. విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ వి.వెంకట బసవరావు అధ్యక్షతన ఈ స్నాతకోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎంగ్రీన్ ఛీఫ్ టెక్నాలజీ ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వి. రామకుమార్‌కు గవర్నర్ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానంచేశారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. భారతదేశంలో యువశక్తి అత్యున్నతమైందని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన మహిళల వరల్డ్ కప్ క్రికెట్ పోటీల్లో మన దేశ క్రీడాకారులు చూపించిన ప్రతిభాపాటవాలు ఎనలేనివని కొనియాడారు. **'నేడు నేను గుర్తించిన అంశమేమంటే 82 శాతం మహిళలకు బంగారు పతకాలు సాధించారు. అభినందనీయం. గర్వకారణం... ఈ విషయంలో పురుషులు వెనుకబడ్డారు. వచ్చే స్నాతకోత్సవం నాటికి పురుషులు కూడా కనీసం సమానంగా బంగారు పతకాలు సాధించాలి. అప్పుడు కూడా నన్ను పిలువాలి'** అని గవర్నర్ ఆర్‌యు విసిని కోరారు.

స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్‌నజీర్

నాటికి దేశాన్ని ప్రగతిపథంలో నిలపాలన్న నూతన విద్యావిధానం తోడ్పాటు నందిస్తుందన్నారు. ఉన్నత విద్యవరకు సమాజం నుండి ఎన్నో పొందిన ప్రతి ఒక్క విద్యార్థి తనదైన బాధ్యతగా సమాజానికి ఉపకరించే పనులు చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం స్నాతకోపన్యాసం చేసిన డాక్టర్ ఎస్ఎస్‌వి.రామ్ కుమార్ మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాలతోపాటు విద్యుత్ రంగంలో

విద్యార్థులు ఉన్నత విద్య పూర్తి కాకముందే లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. ఇటీవల కాలంలో శాస్త్ర సాంకేతిక రంగంలో అనేక విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయన్నారు. ఎఐ, క్వాంటం కంప్యూటింగ్ అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. ఆయా డిగ్రీలద్వారా సంపాదించుకున్న జ్ఞానంతో సార్ధకమైన జీవితాన్ని గడపాలని హితబోధ చేశారు. స్వాతంత్రం సిద్ధించి 100 సంవత్సరాలు పూర్తయ్యే 2047

తాను చేస్తున్న కషికి గుర్తింపుగా తనను గౌరవించిన రాయలసీమ విశ్వవిద్యాలయానికి ధన్యవాదాలు తెలిపారు. స్టార్టప్స్ రంగంలో దేశం ప్రగతిపథంలో దూసుకుపోతోందన్నారు. దేశ ప్రగతి రథానికి విద్యార్థులంతా చోదకశక్తిగా మారాల్సిన అవసరముందని ఆయన సూచించారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రర్ విజయకుమార్ నాయుడు వందన సమర్పణ చేసి కార్యక్రమాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో, రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మెన్ ఆచార్య మధుమూర్తి, రెక్టార్ ఆచార్య ఎన్‌టికె. నాయక్, వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయ కుమార్ నాయుడు గవర్నర్‌ను సన్మానించారు. తర్వాత వివిధ కోర్సుల్లో పిజి, పిహెచ్‌డి పూర్తిచేసుకున్న విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. జాతీయ గీతాలాపనతో స్నాతకోత్సవం ముగిసింది. ప్రత్యేక ఆహ్వానితులుగా కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యేబొగ్గుల దస్తగిరి, కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి,ఎస్‌పి. విక్రాంత్ పాటిల్, ప్రిన్సిపల్ సివి. కష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ ఆచార్య ఎన్. నరసింహులు, డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ పివి. సుందరానంద్, రీసర్చ్ స్టడీస్ డైరెక్టర్ సి.విశ్వనాథరెడ్డి, డీన్ ఆఫ్ అకడమిక్ అఫైర్స్ ఆర్.భరత్ కుమార్, పాలకమండలి సభ్యులు డాక్టర్ శశికళ, డాక్టర్ శైలజతో పాటు, వివిధ విభాగాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాణం చేస్తున్న పట్టాలు పొందిన విద్యార్థులు

విద్యార్థికి గోల్డ్‌మెడల్ అందజేస్తున్న గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్

విద్యార్థికి గోల్డ్‌మెడల్ అందజేస్తున్న గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్‌నజీర్

గోల్డ్ మెడల్ టాపర్స్ అభిప్రాయాలు

రాయలసీమ విశ్వవిద్యాలయంలో వివిధ సబ్జెక్టులలో గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులను ఈ సందర్భంగా ప్రజాశక్తి పలుకరించింది. వారి విజయానికి ప్రోత్సహించిన ప్రొఫెసర్లు, తల్లిదండ్రుల వివరాలు సేకరించింది.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే

- విద్యార్థిని గౌతమి

తల్లిదండ్రుల ప్రోత్సాహించి ఎంతో కష్టపడి చదివించారు. అధ్యాపకుల కృషి వల్ల చదవడం ద్వారానే ఎంసిఎలో గోల్డ్ మెడల్ సాధించాం. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తుపై బాటలు వేసుకొని ముందుకు సాగుతాను.

కష్టపడి చదివినందుకు తగిన గుర్తింపు

- విద్యార్థిని మంజుల

విశ్వవిద్యాలయంలో అధ్యాపకులు బోధించిన పాఠాలను ఎప్పటికప్పుడు అధ్యయనం చేశాను. కష్టపడి చదివినందుకు తనకు కెమిస్ట్రీలో ఈ గుర్తింపు రావడం పట్ల ఎంతో సంతోషంగాఉంది.

ఉన్నత లక్ష్యాన్ని చేరుకుంటాను

- విద్యార్థిని ప్రియాంక

ఇప్పుడు విశ్వవిద్యాలయంలో తనకు వచ్చిన గోల్డ్ మెడల్‌ను సాధించడం ఎంతో ఆనందంగా ఉంది. దీంతో జీవితంలో ఉన్నత లక్ష్యాన్ని చేరుకునేందుకు మరింత కష్టపడి ముందుకు సాగుతాను.

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ ఆపాలి

- వైసిపి ప్రజా ఉద్యమం - నియోజవర్గ కేంద్రాల్లో భారీ ప్రదర్శనలు
- అధికారులకు వినతిపత్రాలు సమర్పణ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్/పత్తికొండ/కోడుమూరు

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణను ఆపాలని వైసిపి చేపట్టిన ప్రజా ఉద్యమంలో భాగంగా బుధవారం జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఎస్‌టిబిసి కాలేజీ మైదానం నుంచి కర్నూలు జిల్లా పరిత్ వరకు కర్నూలు జిల్లా అధ్యక్షులు ఎస్‌వి.మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రదర్శన చేశారు. వైసిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కాటసాని ఇంటి నుంచి కల్లూరు తహశీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. డిప్యూటీ తాహశీల్దార్ విష్ణు ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. పత్తికొండ మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి ఇంటి నుంచి ఆర్‌డిఒ కార్యాలయం వరకు ప్రదర్శన చేశారు. ఆర్‌డిఒ కర్యాలయ అధికారికి వినతి పత్రం అందజేశారు. కోడుమూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆదిమూలపు సతీష్, కుడా మాజీ ఛైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి నాయకత్వంలో కోడుమూరులో నిరసన ప్రదర్శన చేశారు. ఆనంతరం తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

కర్నూలు హాస్పిటల్ : వైసిపి కర్నూలు జిల్లా అధ్యక్షులు, కర్నూలు అసెంబ్లీ ఇంచార్జ్ ఎస్.వి మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. వైసిపి కర్నూలు పార్లమెంట్ ఇన్‌ఛార్జీ గంగుల ప్రతాప్‌రెడ్డి, కర్నూలు నగర మేయర్ బివై రామయ్య, కర్నూలు నగర అధ్యక్షులు అహ్మద్ అలీఖాన్, వైసిపి కార్పొరేటర్లు మహిళా నాయకురాలు యువకులు ఈ ర్యాలీలో స్వచ్ఛందంగా పాల్గొన్నారు. వైసిపి జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి కేవలం 11 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు మాత్రమే ఉన్నాయి. 2019 నాటికి చంద్రబాబు మూడుసార్లు 14 ఏళ్ల సీఎంగా పాలించారు. ఆయన హయాంలో ఒక్కటంటే ఒక్క ప్రభుత్వ మెడికల్ కాలేజీ కూడా నిర్మనించలేదని, కనీసం కొత్తగా ఏర్పాటు చేయాలనే ఆలోచన కూడా చేయలేదన్నారు. 2019 ఎన్నికల మేనిఫెస్టోలో జిల్లాకు ఒక మెడికల్ కాలేజీని ఏర్పాటు చేస్తామని వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ప్రజలకు చేరువలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించడంతోపాటు మన విద్యార్థులకు వైద్య విద్యను అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా 17 కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఒక్కో కాలేజీకి కనీసం 50 ఎకరాల స్థలం, రూ.500 కోట్ల నిధులు కేటాయించారన్నారు. గత ఏడాది అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం కొత్త మెడికల్ కాలేజీలను తన అనుయాయులకు కట్టబెట్టాలని నిర్ణయించిందన్నారు. పులివెందుల మెడికల్ కాలేజీలో 50 ఎంబిబిఎస్ సీట్లతో తరగతులు ప్రారంభించడానికి నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసి) గతేడాది అనుమతులు ఇచ్చింది. కానీ.. ఆ సీట్లు మాకు వద్దంటూ ఎన్ఎంసికి సీఎం చంద్రబాబు లేఖ రాశారన్నారు.

కోడుమూరులో వినతిపత్రం అందజేస్తున్న ఆదిమూలపు సతీష్, హర్షవర్ధన్‌రెడ్డి

ఎస్‌వి మోహన్‌రెడ్డి నాయకత్వంలో కర్నూలు నగరంలో ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు

పత్తికొండలో ఆర్‌డిఒ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న కంగాటి శ్రీదేవి, నాయకులు

ఇంటి మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత, జెసి నూరుల్ కమర్

సామూహిక గృహప్రవేశాలు

ఇంటి మంజూరు పత్రాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కల్లూరు అర్బన్‌లో లబ్దిదారులకు ఇంటి మంజూరు పత్రాలను ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి పంపిణీ చేశారు. బుధవారం కల్లూరు అర్బన్ 35 వ వార్డ్ గనిగుంతల కాలనీలో పిఎంఎవై ఎన్టీఆర్ గృహకల్ప పథకం ద్వారా ఇల్లు పొందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, జాయింట్ కలెక్టర్ నూరుల్‌కమర్ ఇంటి మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. నగర మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, హౌసింగ్ శాఖ అధికారులు, కూటమి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నూతన గృహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కె.శ్యామ్‌కుమార్, ఆర్‌డిఒ భరత్

నూతన గృహాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పత్తికొండ

అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు మంజూరు చేస్తామని పత్తికొండ ఎమ్మెల్యే కెఇ.శ్యామ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం పత్తికొండ మండలంలోని పుచ్చకాయల మాడ గ్రామంలో అందరికీ ఇల్లు పథకంలో భాగంగా ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారుల నూతన ఇల్లును ఎమ్మెల్యే కెఇ శ్యామ్ కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 17 నెలల కాలంలో రాష్ట్రంలో మూడు లక్షల ఇల్లు నిర్మాణం పూర్తి చేసిందని అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని నెరవేర్చామని అన్నారు. ఏదైనా సమస్యలుంటే నేరుగా తమను కలవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు సాంబశివరెడ్డి, హౌసింగ్ డిఇ ఆదినారాయణ, ఆర్‌డిఒ భరత్ నాయక్, సర్పంచి హరితరెడ్డి, ఎంపిటిసి చంద్ర, డిఎల్‌డిఒ రామచంద్రారెడ్డి, ఎంపిడిఇ కవిత రెడ్డి, సొసైటీ చైర్మన్ రంగప్ప, రాష్ట్ర బెస్తా కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు పాల్గొన్నారు.

హంద్రీనీవా ద్వారా చెరువులకు నీళ్లు నింపాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

హంద్రీనీవా కాలువ ద్వారా చెరువులకు నీళ్లు నింపాలని, సాగు,తాగునీటి సమస్యను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం కల్లూరు మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని ఉలిందకొండ గ్రామం చెరువును సిపిఎం ప్రతినిధి బృందం బుధవారం పరిశీలించింది. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ మండలంలో హంద్రీనీవా కాలువ ప్రవహిస్తున్నా ఇక్కడి గ్రామాల ప్రజలకు నీళ్లు అందించడంలో పాలకులు పట్టించుకోవడంలేదని విమర్శించారు. 12 సంవత్సరాలుగా హంద్రీనీవాలో నీళ్ళు ప్రవహిస్తున్నా పక్కనే ఉన్న చెరువులకు నీళ్లు నింపాలన్న ఆలోచన పాలకులకు రాలేదన్నారు. ఉలిందకొండ గ్రామం చెరువుకు నీళ్లు నింపడం వలన దాదాపు 400 ఎకరాలకు సాగునీరు, గ్రామానికి తాగునీరు అందించవచ్చని అన్నారు. ఉపాధి అవకాశాలు కల్పించవచ్చన్నారు. చెరువులకు నీళ్లు నింపడంలో పాలకులు నిర్లక్ష్యంగా ఉన్నారని అన్నారు. సిపిఎం గా మండలంలోని అన్ని చెరువులకు నీళ్లు నింపడానికి రైతాంగాన్ని ఏకంచేసి పెద్దఎత్తున ప్రభుత్వంపై పోరాటం చేయడానికి రైతులు గ్రామంలోని ప్రజలు ఐక్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కె మధు, ఎ.కృష్ణ, రాజు, కేశాలు గ్రామంలోని రైతులు పాల్గొన్నారు.

ఉలిందకొండ చెరువును పరిశీలిస్తున్న గౌస్ దేశాయ్, ఇతర నాయకులు

పభుత్వ స్థలం ఆక్రమిస్తే చర్యలు : ఎంపిడిఒ

ప్రజాశక్తి-సి బెళగల్

రోడ్డులోని ప్రభుత్వ ఎంతవరకు ఉంటే అంత వరకు ఎలాంటి నిర్మాణాలు, అక్రమాలు వంటివి చేపడితే చర్యలు తప్పవని ఎంపిడిఒ రాణెమ్మ హెచ్చరించారు. బుధవారం హైస్కూల్ నుండి పలుకు దొడ్డి క్రాస్ రోడ్డు వరకు విఆర్ఒ వెంకటేశ్వర్లు, కార్యదర్శి శ్యామల సమక్షంలో రోడ్డు విస్తరణలో భాగంగా ప్రభుత్వ స్థలలాను కొలతలు వేశారు. రోడ్డు వెడల్పు 90 అడుగుల మేర ఉందని ప్రస్తుతం 7.5 మీటర్ల వెడల్పులో కిలోమీటర్ మేర రోడ్డు విస్తరణ చేపట్టామన్నారు. మరింత వెడల్పు పెరిగే అవకాశం ఉందన్నారు. అందుకే ప్రభుత్వ రోడ్డు స్థలం వదిలేయాలని నిర్మాణాలు చేపట్టి ఆక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రతి ఒక్కరూ మండల కేంద్రం అభివృద్ధికి అలంకరణకు సహకరించాని కోరారు.

రోడ్డు కొలతలు వేస్తున్న రెవెన్యూ అధికారులు

ఐటిసి కంపెనీపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఐటిసి కంపెనీ పై కఠినమైన చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం కొత్త బస్టాండ్ దగ్గర ఉన్న డివైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాఘవేంద్ర, అబ్దుల్లా మాట్లాడారు. ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలు లాభాలేధ్యేయంగా పనిచేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగాలు లేని నిరుద్యోగులకు తక్కువ వేతనాలు ఇచ్చి పని చేయించుకుంటూ మానసిక ఒత్తిడి పెంచి ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. కర్నూల్ హనుమాన్ కాటా దగ్గర ఉన్న కిరాణం జనరల్ స్టోర్స్ కు సరుకులు సరఫరా చేసే ఐటిసి కంపెనీ అదే కంపెనీలో మార్కెట్ ఎగ్జిక్యూటివ్ గా ఉన్న రఘువరన్‌ను మానసికంగా వేధించి ఆత్మహత్యకు పాల్పడేలా చేసిందని అన్నారు. కర్నూలు మండలం ఉల్చాల గ్రామ యువకుడు రఘువరన్ ఆత్మహత్య చాలా బాధాకరమన్నారు. రఘువరన్ ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిన వెంటనే డివైఎఫ్ఐ కార్యకర్తలతో కలిసి సోమవారం హాస్పటల్లో పరామర్శించి అనంతరం మంగళవారం జరిగిన అంత్యక్రియల్లో పాల్గొని వారి కుటుంబానికి అండగా డివైఎఫ్ఐ ఉంటుందని భరోసా ఇచ్చామన్నారు. హాస్పటల్లో పరామర్శిస్తున్న సందర్భంగా ఆత్మహత్య చేసుకున్న రఘువరన్ చెప్పిన మాటలు వారి కుటుంబ సభ్యులు చెప్పిన విషయాలు పూర్తిగా ఐటిసి కంపెనీ ఒత్తిడి ద్వారానే ఆత్మహత్యకు పాల్పడినట్టు ఉన్నాయన్నారు. ఐటిసి యాజమాన్యంపై వెంటనే కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రఘువరన్ కుటుంబానికి ఐటిసి యాజమాన్యం నుండి ఆర్థిక సహాయం చేయించాలని, ప్రభుత్వం కూడా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు హుస్సేన్ భాష సహాయ కార్యదర్శి ప్రకాష్ నాయకులు అంజి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అబ్దుల్లా, వేదికపై రాఘవేంద్ర

విద్య అసమానతలను తగ్గిస్తుంది

మాంటిస్సోరి గోల్డెన్ జూబ్లీ వేడుకలో గవర్నర్ అబ్దుల్ నజీర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

విద్య ద్వారానే సమాజంలో అసమాతనూతలు తగ్గిస్తుందని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. బుధవారం నగరం లోని ఎ.క్యాంప్ మాంటిస్సోరి సీనియర్ సెకండరీ స్కూలులో మాంటిస్సోరి సంస్థల గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ కార్యక్రమం లో గవర్నర్ పాల్గొన్నారు. గవర్నర్ మాట్లాడుతూ మాంటి స్సోరి విద్యా సంస్థల అధినేత కీర్తిశేషులు కళ్యా ణమ్మ అంకిత భావంతో విద్యా రంగం అభివృద్ధికి కషి చేశారన్నారు. పిల్లల సమగ్ర అభివృద్ధిని ప్రోత్సహించడానికి వినూత్న బోధనా పద్ధతులను అమలు చేయడంలో మాంటిస్సోరీ విద్యాసంస్థలు కృషి చేశాయని తెలిపారు. విద్య ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మగౌరవాన్ని పెంపొందిస్తుందన్నారు. అసమానతలను తగ్గించడంలో విద్య ముఖ్యమైన పాత్ర పోషిస్తుందన్నారు. విద్య సామాజిక, ఆర్థిక స్థితిని మెరుగుపరుస్తుందని, పేదరిక చక్రాన్ని విచ్చిన్నం చేస్తుందన్నారు. బాలికలు, మహిళలు చదువుకున్నప్పుడు వారి కుటుంబాలతో పాటు సమాజం కూడా ప్రయోజనం పొందుతుందన్నారు. ప్రభుత్వం బాలికల విద్య, లింగ సమానత్వానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమం ద్వారా బాలికల విద్యను ప్రోత్సహించేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని, దీని వల్ల సమాజానికి మేలు కలుగుతుందని గవర్నర్ పేర్కొన్నారు. విద్య బలమైన, ఆరోగ్యకరమైన సృజనాత్మక , అభివృద్ధి చెందిన సమాజాన్ని సృష్టించడానికి ఉపయోగపడే శక్తివంతమైన సాధనం అన్నారు. క్రమశిక్షణ , సమయ నిర్వహణ ద్వారా జీవితంలో విజయం సాధించవచ్చన్నారు. పాఠశాలలు ఈ లక్షణాలను విద్యార్థులకు చిన్నప్పటి నుండే నేర్పించాలని, విద్యార్థులు సమయాన్ని సమర్థవంతంగా నిర్వహించడం లాంటివి నేర్పించాలన్నారు. ఈ నైపుణ్యాలు నేటి వృత్తిపరమైన ప్రపంచంలో చాలా ముఖ్యమైనవని గవర్నర్ పేర్కొన్నారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ కర్నూలు పట్టణంలో 50 సంవత్సరాల క్రితమే కీర్తిశేషులు కల్యాణమ్మ మాంటిస్సోరీ పాఠశాలకు పునాది వేశారన్నారు. ఇప్పుడు 50 సంవత్సరాల తర్వాత మాంటిస్సోరీ విద్యా సంస్థలు అనేక బ్రాంచులు ప్రారంభించి వేలాది మంది విద్యార్థులకు చదువును నేర్పిస్తున్నారని తెలిపారు. మాజీ రాజ్యసభ సభ్యులు టిజి వెంకటేష్ మాట్లాడుతూ మాంటిస్సోరి విద్యాసంస్థలు విద్యారంగ అభివద్ధికి చేస్తున్న కృషిని ప్రశంసించారు.. కార్యక్రమంలో పాఠశాల అధినేత కెఎన్‌వి రాజశేఖర్ , జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి, ఎస్‌పి విక్రాంత్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

మాంటిస్సోరి గోల్డెన్ జూబ్లీ వేడుకలో గవర్నర్ అబ్దుల్ నజీర్ , కలెక్టర్ ,తదితరులు

మెరుగైన విద్యనందించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆదోని

భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యనందించాలని ఎమ్మెల్యే పార్థసారథి కోరారు. ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డు భీమ్ రెడ్డి కాలనీలో ఉర్దూ మీడియం పాఠశాల నూతన భవనం నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాలనీలో ముస్లిం, మైనార్టీలు ఎక్కువగా ఉన్నారని, వారి పిల్లలకు ఉర్దూ పాఠశాల కావాలని అడిగారని అన్నారు. అధికారులతో మాట్లాడి మున్సిపల్ కమిషనర్ ద్వారా స్థలం కేటాయించడమే కాకుండా సర్వశిక్ష అభియాన్ ద్వారా రూ.13 లక్షలు మంజూరు చేయించి భూమి పూజ చేసినట్లు తెలిపారు. అధికారులు కలిసి పాఠశాల ఏర్పాటులో తోడ్పాటును అందించిన కౌన్సిలర్ లలితమ్మకు అభినందనలు తెలిపారు. ఎంఇఒ శ్రీనివాసులు, నాయకులు వెల్లాల మధుసూదనశర్మ, మహబూబ్ బాషా, పరమేశ కిరణ్, పూల రఘు, ఎఇ అంజాలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి : వ్యకాస

ప్రజాశక్తి - కోసిగి

మాట్లాడుతున్న నాయకులు

ప్రమాదవశాత్తు మృతి చెందిన వలస కూలీల కుటుంబాలను ఆదుకోవాలని వ్యకాస జిల్లా నాయకులు తిక్కన్న, మండల నాయకులు నాగేంద్ర, సిఐటియు మండల కార్యదర్శి రాముడు కోరారు. బుధవారం వారు మాట్లాడారు. మండలంలోని ఆర్లబండ గ్రామానికి చెందిన దుద్ది హరికృష్ణ, మూగలదొడ్డి గ్రామానికి చెందిన తలారి వెంకలయ్య వలస కూలీలు సోమవారం ప్రమాదవశాత్తు మృతి చెందారని తెలిపారు. దుద్ది హరికృష్ణ తెలంగాణకు వలస వెళ్లి పత్తి పొలంలో పనిచేస్తుండగా స్పృహ తప్పి పడిపోయి అక్కడికక్కడే మృతి చెందారని చెప్పారు. తలారి వెంకలయ్య సిమెంట్ పని కోసం తిరుపతి వెళ్లగా బస్సు ప్రమాదానికి గురై మరణించారని తెలిపారు. ప్రభుత్వం వారి కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరారు.

కుష్టు నివారణకు సహకరించాలి

- డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి

ప్రజాశక్తి - ఆదోని

మాట్లాడుతున్న డాక్టర్ సత్యవతి

కుష్టు లక్షణాలను ప్రాథమిక దశలోనే గుర్తించి సమూలంగా అరికట్టేందుకు సహకరించాలని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి కోరారు. బుధవారం ఆదోని ప్రభుత్వాస్పత్రిలో కుష్టువ్యాధి లక్షణాల గుర్తింపుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 2027వ సంవత్సరం నాటికి కుష్టు వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలనే ప్రణాళికతో ఈనెల 17 నుంచి 30వ తేదీ వరకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ... చర్మంపై స్పర్శ లేని రాగి లేదా ఎరుపు రంగు మచ్చలు, చెవులపై బుడిపెలు వంటి లక్షణాలుంటే కుష్టుగా నిర్ధారించాలని తెలిపారు. ఈ లక్షణాలున్న వారిని గుర్తించి ఎండిటి చికిత్స ద్వారా మందులు అందించాలన్నారు. ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించి, లక్షణాలున్న వారిని గుర్తిస్తే కుష్టును సమూలంగా అరికట్టవచ్చన్నారు. డెర్మటాలజిస్టు డాక్టర్ పైనీ ప్రియాంక, డిపిఎంఒలు సీతారాముడు, చంద్రశేఖర రెడ్డి, సుబ్రమణ్యం ఉన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

- ఎడిఎ చెంగల్ రాయుడు, ఎఒ శ్రీరామ్ ప్రవీణ్

ప్రజాశక్తి - చిప్పగిరి

రైతులు సాగు చేసిన వివిధ రకాల పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఎడిఎ చెంగల్ రాయుడు, ఎఒ శ్రీరామ్ ప్రవీణ్ తెలిపారు. బుధవారం నేమకల్లు, సంగాల గ్రామాల్లో అగ్రికల్చర్ అసిస్టెంట్ మనోహర్ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తుంది' నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పప్పు శనగ విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన కల్పించారు. రబీలో ప్రధాన పంట అయిన పప్పు శనగ పైరుకు ఎర్ర తెగులు సోకినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సంబంధిత అగ్రికల్చర్ అధికారులను అడిగి తెలుసుకోవాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించే పంటలపై కూడా రైతులు ఆసక్తి చూపాలన్నారు. రైతులు ఎరువులు, పురుగు మందులు అధికంగా వాడడం వల్ల వాతావరణ కాలుష్యంతో పాటు దిగుబడి కూడా తగ్గేందుకు ఆస్కారం ఉందని తెలిపారు. అనంతరం రైతులతో సమావేశం నిర్వహించారు.

సంగాలలో పొలంబడి నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

ఉచిత వైద్యానికి బాబు వ్యతిరేకం

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి - మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ర్యాలీ

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రజలకు ఉచిత వైద్యమందించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యతిరేకమని, జగన్మోహన్ రెడ్డి మంజూరు చేసిన మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరణ చేస్తున్నారని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి విమర్శించారు. బుధవారం మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా స్థానిక అభోదే హోటల్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, తహశీల్దార్ కె.రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మద్యం దందా చేస్తూ దోచుకుంటున్నారని, మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరించి, కాంట్రాక్టర్లకు పేద, మధ్య తరగతి ప్రజలను దోచుకునేందుకు అనుమతులు ఇవ్వడం దారుణమని మండిపడ్డారు. గత ఎన్నికల్లో వైసిపిని ఓడించడానికి కూటమిగా చుట్టుముట్టినా ఒక్కడే జగన్మోహన్ రెడ్డి పోరాడారని తెలిపారు. ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీ ప్రజలే తమ కుటుంబానికి అండ అని, వారి వల్లే తాను 4 సార్లు ఎమ్మెల్యేగా గెలిచానని చెప్పారు. ఈ విషయం మరిచి టిడిపి ఇన్‌ఛార్జీ టీవీలందరూ తమ సోదరులని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని తెలిపారు. తనను విమర్శించే స్థాయి టిడిపి ఇన్‌ఛార్జికి లేదని, తమ చెట్టు నీడలో పెరిగిన విషయం మరవద్దని సూచించారు. వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్ రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, మండలాల అధ్యక్షులు జి.భీమారెడ్డి, బెట్టన్న గౌడ్, రామ్మోహన్ నాయుడు, దేశాయ్ ప్రహ్లాద్ చారి, కోసిగి మండల ఇన్‌ఛార్జీ మురళీ మోహన్ రెడ్డి, మండల ఇన్‌ఛార్జ్ విశ్వనాథ్ రెడ్డి, డాక్టర్ల విభాగం అధ్యక్షులు దశరథరెడ్డి, సర్పంచి తెల్లబండ భీమయ్య, మల్లికార్జున రెడ్డి, విద్యార్థి విభాగం నాయకుడు మహబూబ్ పాల్గొన్నారు. **ఆలూరులో** జిల్లా వైఎస్సార్‌సిపి ఆధ్వర్యంలో 'ప్రజా పోరు' నిర్వహించారు. ఎన్నికల అబ్జర్వర్ సూర్యప్రకాశ్ రెడ్డి, వైకుంఠం మల్లికార్జున చౌదరి, మధుసూదన్ రెడ్డి, సురేంద్ర రెడ్డి, నాయకులు, కార్యకర్తలు ఆలూరులోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. భారీ ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహశీల్దార్ శోభ సువర్తకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి 17 మెడికల్ కళాశాలలు మంజూరు చేసి 5 కళాశాలలను ప్రారంభించారని తెలిపారు. మిగిలిన 12 కళాశాలలు 80 శాతం పూర్తయ్యాయని, వాటిని పూర్తి చేయాల్సిన కూటమి ప్రభుత్వం ప్రయివేటుపరం చేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వం ప్రయివేటీకరణను ఆపకపోతే ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. **ఆదోని** వైసిపి కార్యాలయం నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శన చేపట్టారు. సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. మున్సిపల్ చైర్పర్సన్ లోకేశ్వరి, వైస్ చైర్మన్ నరసింహులు అధ్యక్షత వహించారు. మాజీ ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ... మెరుగైన వైద్యం అందించాలన్న ఉద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మెడికల్ కళాశాలను మంజూరు చేశారని తెలిపారు. అడ్వకేట్ జీవన్ సింగ్, డాక్టర్ సలోని, నాయకులు

మంత్రాలయంలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చంద్రకాంత్ రెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ మహబూబ్ బాషా, మాజీ జడ్‌పిటిసి ఆనంద్, మున్సిపల్ మాజీ చైర్మన్ దేవదాసు, సన్నీ, ఫయాజ్, ఏసోబు, లీగల్ అడ్వయిజర్ నాగరాజు, న్యాయవాదులు తబ్రేజ్, మాజీ ఎఎంసి అంజనప్ప, నాయకులు కామాక్షి తిమ్మప్ప, గోల్డ్ రమేష్, కిశోర్, నాల్గింట నారాయణ, శ్రీలక్ష్మి ఫ్రాన్సిస్, తాయన్న, శేషిరెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, రామలింగేశ్వర యాదవ్, ఉరుకుందప్ప పాల్గొన్నారు. **ఎమ్మిగనూరులో** మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి నివాసం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఎర్రకోట రాజీవ్ రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు, రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి, ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి మాట్లాడారు. ప్రజల ఆరోగ్య హక్కును ధర్మంగా భావించి, పేద విద్యార్థుల కలలను నిజం చేసేందుకు జగన్ మోహన్‌రెడ్డి మెడికల్ కళాశాలలను మంజూరు చేశారని తెలిపారు.

ఆలూరులో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆదోనిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే

ఎమ్మిగనూరులో వైసిపి ర్యాలీ

రేషన్ పంపిణీని సక్రమంగా చేపట్టాలి

- కురువ కార్పొరేషన్ డైరెక్టర్ ఉదయ్‌కుమార్

ప్రజాశక్తి - ఆస్పరి

ఆర్‌డిఒను కలిసిన ఉదయ్ కుమార్

మండలంలోని ప్రజలకు రేషన్ సక్రమంగా అందడం లేదని, రేషన్‌లో అవకతవకలు జరుగుతు న్నాయని కురువ కార్పొరేషన్ డైరెక్టర్ కెసి.ఉదయ్ కుమార్ తెలి పారు. బుధవారం జనసేన ఇన్‌ఛార్జీ వెంకప్ప ఆదేశాల మేరకు పత్తికొండ ఆర్‌డిఒ భరత్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. ఏ గ్రామానికి వెళ్లినా తాగునీరందక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రోడ్లు, డ్రెయినేజీ కాలువలు లేక రోడ్లపై మురుగునీరు చేరి దోమలు వృద్ధి చెంది ప్రజలు అనారోగ్యాల బారిన పడే అవకాశం ఉందని చెప్పారు. ప్రభుత్వ పథకాలు కూడా ప్రజలకు సక్రమంగా అందడం లేదని వివరించారు. ఆర్‌డిఒ స్పందిస్తూ... అధికారులతో మాట్లాడి విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. జనసేన నాయకులు అంజి, కుమార్ పాల్గొన్నారు.

వలస విద్యార్థుల ఆశాకిరణం సీజనల్ హాస్టళ్లు

- ఎంఇఒ శ్రీనివాస్ రెడ్డి - సీజనల్ హాస్టల్ ప్రారంభం

ప్రజాశక్తి-హాలహర్వి

సీజనల్ హాస్టళ్లు వలస విద్యార్థులకు ఆశాకిరణం లాంటివని ఎంఇఒ-2 శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. తల్లిదండ్రులు వలస వెళ్లిన విద్యార్థులకు అండగా ఉషోదయ గ్రామీణాభివృద్ధి సంస్థ సీజనల్ హాస్టళ్లను నిర్వహిస్తోంది. బుధవారం ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా సమగ్ర శిక్ష సౌజన్యంతో ఉషోదయ గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో హాలహర్వి మండలం నిట్రవట్టి గ్రామంలో సీజనల్ హాస్టల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గతేడాది సీజనల్ హాస్టల్‌లో ప్రభుత్వం 50 మందికి మాత్రమే అన్ని సౌకర్యాలు కల్పించినా అదనంగా మరో 20 మందికి సంస్థ తరఫున అన్ని వసతులూ కల్పించారని తెలిపారు. ఈ ఏడాది కూడా ఎలాంటి నిబంధనలూ లేకుండా అదనంగా మరో 20 మందికి వసతులు కల్పిస్తారని చెప్పారు. తల్లిదండ్రులు వలస వెళితే వారి పిల్లలు చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న సీజనల్ హాస్టల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని బాగా చదువుకోవాలని సూచించారు. హాస్టల్ విద్యార్థులు చెరువులు, బావులకు స్నానాల కోసం వెళ్లకుండా ఇక్కడే స్నానం చేయాలని తెలిపారు. ఏదైనా ప్రమాదాలు సంభవిస్తే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని చెప్పారు. సిఆర్‌పిలు ముక్కన్న, డిటిపి సురేష్ స్వామి, జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేందర్, ఉషోదయ గ్రామీణాభివృద్ధి సంస్థ వ్యవస్థాపకులు సిహెచ్.నాగరాజు, సీజనల్ హాస్టల్ ఉపాధ్యాయుడు కె.అయ్యన్న గౌడ్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

సిసి రోడ్ల నిర్మాణానికి రూ.1.10 కోట్లు

- పంచాయతీరాజ్ ఎఇ సోమప్ప

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరి మండలంలో సిసి రోడ్డు నిర్మాణాలు చేపట్టేందుకు రూ.1.10 కోట్లు మంజూరయినట్లు పంచాయతీరాజ్ ఎఇ సోమప్ప తెలిపారు. బుధవారం మండల కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మండలంలో ఎక్కువ సమస్య ఉన్న నేమకల్లు, సంగాల, కుందనగుర్తి, రామదుర్గం, బంటనహాల్, నంచర్ల గ్రామాల్లో 15వ ఆర్థిక సంఘం నిధులతో సిసి రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నామని తెలిపారు.

పేదల సొంతింటి కల సాకారమే ధ్యేయం

- ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - గోనెగండ్ల

పేదల సొంతింటి కలను సాకారం చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. గోనెగండ్లలో నూతన ఇంటిని ప్రారంభించి లబ్ధిదారులు లక్ష్మీదేవమ్మ కుమారుడు ఎర్రిస్వామి, కోడలు శ్యామలకు నూతన వస్త్రాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ... సొంత ఇల్లు లేని నిరుపేదలకు ఇల్లు నిర్మించి ఇస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పేదల ఇంటి కలను నెరవేరుస్తోందని తెలిపారు. జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి, ఎంపిడిఒ మణిమంజరి, డిటి రఘువీర, హౌసింగ్ డిఇ ప్రసాద్, ఎఇ షేక్షావలీ, టిడిపి మండల కన్వీనర్ తిరుపతయ్య నాయుడు, టౌన్ ప్రెసిడెంట్ మహేళ రహమతుల్లా, బేతాళ బడేసా, సింగిల్ విండో ప్రెసిడెంట్లు తిమ్మారెడ్డి, ఎన్‌వి.రామాంజనేయులు, మురళీ నాయుడు, కాంట్రాక్టర్ షేక్షావలీ, రంగస్వామి నాయుడు, హరికృష్ణ, రాజేష్, గౌవుండా రహమతుల్లా, అక్బర్ వలీ, ఐరన్ బండ బాష పాల్గొన్నారు. **ఆదోని (రూరల్)** నియోజకవర్గంలోని ధణాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇళ్లలో గృహ ప్రవేశాలు నిర్వహించారు. ఎమ్మెల్సీ బీటీ.నాయుడు, ఎమ్మెల్యే పార్థసారథి, ఆదోని సబ్ కలెక్టర్ అజయ్ కుమార్ పాల్గొన్నారు. **మంత్రాలయం** మండలంలోని మాధవరం గ్రామంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన 3 లక్షల గృహ ప్రవేశాలను జనసేన ఇన్‌ఛార్జీ బి.లక్ష్మన్న, బిజెపి ఇన్‌ఛార్జీ విష్ణువర్ధన్ రెడ్డితో కలిసి టిడిపి ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులు మీనాక్షి అందించిన తేనేటి విందును స్వీకరించారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి, డీపీఒ భాస్కర్, టిడిపి మండల అధ్యక్షులు గోపాల్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ నర్సిరెడ్డి, తహశీల్దార్ రమాదేవి, ఎంపిడిఒ నూర్జహాన్, హౌసింగ్ డిఇ లాలీ కృష్ణయ్య, మాధవరం సర్పంచి ఇందిరమ్మ, మాజీ జడ్‌పిటిసి ఆర్.లక్ష్మయ్య, జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేష్, పంచాయతీ సెక్రటరీ వేణుగోపాల్, ఇంజినీర్ అసిస్టెంట్ పవన్ పాల్గొన్నారు. **ఆలూరు** నియోజకవర్గంలోని హత్తి బెళగల్ గ్రామంలో టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి లబ్ధిదారులు మంజులతో పూజ నిర్వహించి రిబ్బన్ కట్ చేసి గృహ ప్రవేశం చేశారు. అనంతరం ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గదుల కొరత ఉందని, ఆడుకోవడానికి గ్రౌండ్ లేదని, అదనపు భవన నిర్మాణం 80 శాతం పనులు పూర్తయి ప్రస్తుతం నిలిచిపోయిందని విద్యార్థులు తెలిపారు. ఆమె స్పందించి సంబంధిత అధికారులు ఫోన్‌లో మాట్లాడి కారణాలను అడిగి తెలుసుకున్నా రు. ఎంపిడిఒ మద్దిలేటి స్వామి, హౌసింగ్ డిఇ విజయ్ కుమార్ నాయకులు ఈరన్న, శీనప్ప పాల్గొన్నారు.

గోనెగండ్లలో నూతన వస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే

మంత్రాలయంలో గృహ ప్రవేశాలకు హాజరయిన నాయకులు


ఆలూరులో పాల్గొన్న నాయకులు

క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదు

- టిడిపి నాయకులు సురేష్ నాయుడు, వెంకటపతి రాజు

ప్రజాశక్తి - కౌతాళం

టిడిపిలో క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఎలాంటి వారైనా ఉపేక్షించేది లేదని టిడిపి మండల కన్వీనర్ సురేష్ నాయుడు, సింగిల్‌విండో అధ్యక్షులు వెంకటపతి రాజు, సీనియర్ నాయకులు కురువ వీరేష్ హెచ్చరించారు. బుధవారం టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సీనియర్ నాయకులు సుబ్రమణ్యం రాజు టిడిపి ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డిపై చేసిన ఆరోపణలను ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పార్టీ సభ్యత్వం లేని వారు విమర్శలు చేసేటప్పుడు ఆలోచించి మాట్లాడితే బాగుంటుందన్నారు. ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి గురించి విమర్శలు చేసిన సుబ్రమణ్య రాజుపై పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ విమర్శల వెనకాల పార్టీలో ఉన్న కోవర్టులు ఉన్నారని, రాఘవేంద్ర రెడ్డిపై అగ్రవర్ణ కులాలు, ప్రస్తుత ఎమ్మెల్యేతో కుమ్మక్కయి విమర్శలు చేస్తున్న సుబ్రమణ్య రాజుపై పార్టీ క్రమశిక్షణ కమిటీకి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఏవైనా వ్యక్తిగత సమస్యలుంటే ముఖాముఖి చర్చించుకొని పరిష్కరించుకోవాలని, ఇలా పార్టీపై రుద్ది, పార్టీ క్రమశిక్షణకు భంగం కలిగించే విధంగా విమర్శలు చేస్తే మాత్రం సహించబోమని హెచ్చరించారు.టిడిపి పట్టణ అధ్యక్షులు డాక్టర్ రాజానందు, ముక్కన్న, గిరి, సుభాన్, రంగస్వామి, నాగిరెడ్డి, నరసప్ప, రామాంజినేయులు, వీరేష్, నబీ, గొట్టయ్య, అమ్ము వలీ, కృష్ణ, భీమా, హుస్సేని, వెంకటేష్, మహాదేవ, ఉప్పలపాటి అర్జున్, వెంకటేష్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు

- తహశీల్దార్ రజనీకాంత్ రెడ్డి - ఇసుక ట్రాక్టర్లు సీజ్

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని తుంగభద్ర నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తహశీల్దార్ రజనీకాంత్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా కుంభాలనూర్ వద్ద నుంచి వివిధ ప్రాంతాలకు తరలిస్తున్న 10 ట్రాక్టర్లను సీజ్ చేశామన్నారు. అవసరం ఉన్నవారు శాండ్ యాప్‌లో వివరాలను నమోదు చేయించి నిబంధనల ప్రకారం ఇసుకను పొందాలని తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటామంటే వదిలి పెట్టే ప్రసక్తే లేదన్నారు. పట్టుకున్న ట్రాక్టర్లను మైనింగ్ అధికారులకు అప్పగిస్తామని తెలిపారు. ఇసుక రీచ్‌లకు ప్రభుత్వ అనుమతులు వచ్చే వరకు తుంగభద్ర పరిసరాల్లో రెవెన్యూ సిబ్బంది ద్వారా నిఘాను పెంచామని చెప్పారు.

సీజ్ చేసిన ట్రాక్టర్లు

నిర్మాణంలో ఉన్న కళాశాల భవనాలు

'కెజిబివి' నిర్మాణ పనులు వేగవంతం

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండ కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో బాలికల జూనియర్ కళాశాల నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ రోజమ్మ, జనసేన నాయకులు బంగి చంటిబాబు ఆధ్వర్యంలో ఈ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వారు మాట్లాడుతూ... జనసేన ఆలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ తెర్నేకల్ వెంకప్ప సహకారంతో భవన నిర్మాణాలు నాణ్యతగా చేపట్టామన్నారు.

మార్కెట్ యార్డు డైరెక్టర్‌కు సన్మానం

ప్రజాశక్తి - దేవనకొండ

ఆలూరు మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన జనసేన వీర మహిళా నాయకులు బోయ సరోజను జనసేన మండల నాయకులు కటిక ఉచ్చీరప్ప, రామాంజనేయులు, వీరేష్, బడేసాబ్, బంగి బాలు, చంటి బుధవారం పూలమాల, శాలువా వేసి సన్మానించారు. జనసేన పార్టీ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు లభిస్తుందన్నారు.

డైరెక్టర్ సరోజను సన్మానిస్తున్న జనసేన నాయకులు

బైక్ ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

- మానవత్వం చాటుకున్న ఎంపిపి భర్త లుముంబా

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని కుంకనూరు క్రాస్ రోడ్డు వద్ద బుధవారం ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. ఆస్పరి మండలం బనవనూరు గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు వ్యక్తిగత పనుల నిమిత్తం దేవనకొండకు వచ్చి స్వగ్రామానికి బయల్దేరారు. మోటార్ సైకిల్ అదుపు తప్పి కింద పడడంతో గాయాలయ్యాయి. అదే సమయంలో ఆలూరు నుంచి దేవనకొండ వైపు వస్తున్న ఎంపిపి లక్ష్మీదేవి భర్తలు లుముంబా ప్రమాద సంఘటనను చూసి వారిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి అధికారులతో వైద్య సేవలు చేయించారు.

ప్రతిభకు ప్రశంసలు : ప్రిన్సిపల్

ప్రజాశక్తి - కౌతాళం

కౌతాళం కెజిబివి నుంచి ఆరుగురు విద్యార్థినులు ప్రతిభ కనబరిచి ప్రశంసాపత్రాలు అందుకున్నారని ప్రిన్సిపల్ పుష్పలత తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడారు. విశాఖపట్నంలో నిర్వహించిన ఎపి సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో పిఇటి లక్ష్మి ఆధ్వర్యంలో పాల్గొన్న అఖిల, శాంతి, లక్ష్మి, మల్లిక, శైలజలకు ప్రశంసా పత్రాలను అందజేశారన్నారు. ఎటువంటి ప్రశంసా పత్రాలు రాబోయే రోజుల్లో మరిన్నీ సాధించాలని ఆకాంక్షించారు.

నేడు ప్రమాణ స్వీకారం : టిడిపి

ప్రజాశక్తి - కౌతాళం

టిడిపిలో కష్టపడి పని చేసే వారికి పదవులు వాటంతటా అవే వస్తాయని టిడిపి మండల అధ్యక్షులు సురేష్ నాయుడు తెలిపారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రాలయం నియోజకవర్గంలోని కౌతాళం, కోసిగి, పెద్దకడబూరు, మంత్రాలయం టిడిపి మండల అధ్యక్షులతో పాటు మండల, గ్రామ, బూత్ కమిటీలు, క్లస్టర్ ఇన్‌ఛార్జీలు, యూనిట్ ఇన్‌ఛార్జీలతో మాధవరంలో ప్రమాణ స్వీకారం టిడిపి మంత్రాలయం ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. టిడిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు, బాలయ్య అభిమానులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న సురేష్ నాయుడు

'క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు'

ప్రజాశక్తి - ఆదోని రూరల్

చదువుతోపాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణిస్తూ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని పెద్దతుంబలం నేషనల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి తెలిపారు. క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బుధవారం స్కూల్ ఆవరణలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన క్రీడల్లో విద్యార్థులు ప్రతిభ చాటారన్నారు. ఖోఖో పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయికి వరుసగా నాలుగోసారి ఎంపికై పాఠశాలకు పేరు, ప్రతిష్టలు తీసుకొచ్చారని తెలిపారు. అండర్-17 బాలికల విభాగంలో స్వప్న, అండర్-14 బాలి కల విభాగంలో శ్రీలత, అండర్-17 బాలుర విభాగంలో హరి కృష్ణ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. రాష్ట్ర స్థాయిలో పోటీల్లో మెళకువలు పాటించి ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. పిఇటిలు బసవరాజు, బాలును అభినందించారు.

ఘనంగా 'ఉల్లాస్ అక్షరాంధ్ర' శిక్షణ

ప్రజాశక్తి - హొళగుంద

మండలంలో 'ఉల్లాస్ అక్షర ఆంధ్ర' శిక్షణను ఎపిఎం ఎం.తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. వయోజన విద్య సూపర్‌వైజర్ కె.రమణయ్య వారికి అక్షరాంధ్ర గురించి వివరించారు. ఆయన మాట్లాడుతూ... ఒక వాలంటీరు టీచర్ పది మంది నిరక్షరాస్యులకు చదువు చెప్పాలని, వారికి చదవడం, రాయడం, చిన్న, చిన్న లెక్కలు చేయడం నేర్పించాలని తెలిపారు. ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత గురించి వివరించారు. మండలంలో ఎన్‌ఆర్‌ఇజిఎస్‌కు 1,120 మందిని కేటాయించారని, వారికి మార్చిలోపు చదువు చెప్పి అక్షరాస్యులుగా చేస్తామని తెలిపారు. గ్రామాల్లో రోజూ సాయంత్రం అభ్యాసకులకు వాలంటీరు టీచర్ చదువు చెబుతారని అన్నారు.

కార్యకర్తలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

కార్యకర్తలకు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రమాదంలో గాయపడిన వైసిపి కార్యకర్తలను ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పరామర్శించారు. బుధవారం వైసిపి నాయకులు శివప్ప కుమారుడు సంపత్ కుమార్, వైసిపి మండల అధ్యక్షులు జి.భీమారెడ్డి డ్రైవర్ నాగరాజు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన సంపత్ కుమార్‌ను ఇంటికి వెళ్లి పరామర్శించగా, మండలంలోని 52 బసాపురం గ్రామంలోని నాగరాజు ఇంటికి వెళ్లి పలకరించారు. వైసిపి మండలాధ్యక్షులు భీమారెడ్డి, యువ నాయకులు దశరథ్ రెడ్డి, నాయకులు గోర్కల్ కృష్ణస్వామి, శివప్ప, కురువ మల్లికార్జున, జనార్ధన్ రెడ్డి, పెట్రోల్ బంకు శ్రీనివాసులు, బొంబాయి శివ ఉన్నారు.

నూతన గృహాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

మండలంలోని 52 బసాపురం గ్రామంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి నూతన గృహాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం నుంచి ఎన్‌టిఆర్ గృహ సంకల్పం పథకం ద్వారా మంజూరైన ఇంటి నిర్మాణం పూర్తి కావడంతో ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి గృహ ప్రవేశం చేయించారు. లబ్ధిదారులు బోయ భీమక్క ఎమ్మెల్యేకు, వైసిపి మండల అధ్యక్షులు జి.భీమారెడ్డికి శాలువా, పూలమాల వేసి సన్మానించారు. ఇన్‌ఛార్జీ ఎఇ వీరేంద్ర, డిప్యూటీ ఎంపిడిఒ ఉపేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

- గ్రంథాలయ అధికారి శివరామప్రసాద్

ప్రజాశక్తి - నందవరం

గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని గ్రంథాలయ అధికారి వై.శివరామ ప్రసాద్ కోరారు. బుధవారం ఆయన మాట్లాడారు. ఈనెల 14 నుంచి 20 వరకు 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 14న వారోత్సవాల ప్రారంభ వేడుకలు, బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన ఉంటుందన్నారు. 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖుల గురించి అవగాహన కల్పిస్తామని తెలిపారు. 17, 18వ తేదీల్లో విద్యార్థులకు వ్యాసరచన, ఆటల పోటీలు, 19న కీర్తిశేషులు భారతదేశపు తొలి మహిళా ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతి వేడుకలు, 20న ముగింపు వేడుకల్లో గ్రంథాలయాల ప్రాముఖ్యత గురించి, వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం ఉంటుందని చెప్పారు.

CHANGE OF NAME

I, BAIBARE MOHAMMED AFFAN, S/o BAIBARE ILIYAS, residing at H.No: 1/2961, SMT Colony, 4th Line, Yemmiganur (M), Kurnool Pistrict, Andhra Pradesh, hereby declare that my father ILIAS BAI BARE is also known as BAIBARE ILIYAS. Both names refer to one and the same person.

IN THE COURT OF THE HON'BLE CIVIL JUDGE [SENIOR DIVISION] ADONI
I.P. No. 15/2025

Between:-
Shashimi veeresh, S/o. Shashimi Shrinivasulu, Hindu aged about 40 years,R/o H.No. 1/49, Gudikal Village, Yemmiganur mandal kurnool dist. ...petitioner
V/s
Banda Nagaraju and 10 others. ...Respondent's

GENERAL NOTICE TO PUBLIC

Whereas the above named petitioner filed insolvent petition under Section 10 of the Provincial Insolvency Act to declare the petitioner as insolvent. Hence any body has got any wants any objection with Regard to the above Insolvent petition are hereby appear before this Hon'ble Court on 21.11.2025 at 10.30 A.M and answer the said petition and also any body wants any objection to appear before this Hon'ble court, otherwise the petition will be decided exparte.

// By Court Order//
M.VANNAPPA,
ADVOCATE, ADONI

IN THE COURT OF THE HON'BLE CIVIL JUDGE [SENIOR DIVISION] ADONI
I.P. No. 9/2025

Between:-
Ediga Veeranji, S/o. Ediga Lakshmanna, Hindu aged about 31 years,R/o H.No. 3/135, Gudikal Village, Yemmiganur mandal, kurnool dist. ....petitioner
V/s
Akula Mangaiah and 1 other. ...Respondent's

GENERAL NOTICE TO PUBLIC

Whereas the above named petitioner filed insolvent petition under Section 10 of the Provincial Insolvency Act to declare the petitioner as insolvent. Hence any body has got any wants any objection with Regard to the above Insolvent petition are hereby appear before this Hon'ble Court on 27.11.2025 at 10.30 A.M and answer the said petition and also any body wants any objection to appear before this Hon'ble court, otherwise the petition will be decided exparte.

// By Court Order//
M.VANNAPPA,
ADVOCATE,ADONI

కేన్సర్‌ను ముందస్తుగా గుర్తిస్తే మంచిది

స్త్రీ వ్యాధి నిపుణులు డాక్టర్ సాహిత్య జయరాం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

ప్రతిఒక్కరు కేన్సర్ పరీక్షలు చేయించుకోవాలని, కుటుంబంలో ఎవరికైనా కేన్సర్ ఉంటే 40 యేళ్లలోపు తప్పకుండా పరీక్ష చేయించుకోవాలని , ముందస్తు చర్యలతో కేన్సర్‌కు పూర్తిగా దూరం కావ్చని స్త్రీ వ్యాధి నిపుణులు డాక్టర్ సాహిత్య జయరాం సూచించారు. కర్నూలు మెడికల్ కాలేజీ లెక్చరర్ గ్యాలరీలో బుధవారం సర్వైకల్ (గర్భాశయ ముఖ ద్వారం) కేన్సర్ గురించి శిక్షణలో స్త్రీ వ్యాధి నిపుణులు డాక్టర్ సాహిత్య జయరాం మాట్లాడుతూ పొత్తి కడుపు నొప్పి, నెలసరికి మధ్య రక్తస్రావం, మెనోపాజ్ తరువాత రక్తస్రావం ఉంటే తక్షణమే వైద్యులను సంప్రదించాలన్నారు. కుటుంబంలో ఎవారికైనా కేన్సర్ ఉంటే 40 సంవత్సరాలలోపు నుంచే ఏడాదికి ఒక సారి స్కానింగ్ వంటి పరీక్షలు చేయించుకోవడం ద్వారా తొలి దశలో కేన్సర్‌ను గుర్తిస్తే వైద్యం ద్వారా పూర్తిగా నయం చేయవచ్చని అన్నారు. సర్వైకల్ (గర్భాశయ ముఖ ద్వారము) కేన్సర్ రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు అందుబాటులో ఉన్న చికిత్సల గురించి వివరించారు. ముందస్తుగా టీకా వేయించుకోవడం ద్వారా వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చునని తెలిపారు. 20 సంవత్సరాలు దాటిన వారందరూ పాప్ స్మియర్ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. కేన్సర్ నివారణలో అత్యాధునిక వైద్య పద్దతులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అసంక్రమిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్.మహేశ్వరప్రసాద్, డాక్టర్.భాస్కర్, స్త్రీ వ్యాధి నిపుణులు నికత్ నస్రీన్,దంత వైద్యులు హడస్సా, నవ్యతేజ, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ సుధాకర్, ఆర్‌కెఎస్‌కె కన్సల్టెంట్ మల్లికార్జున, ఫైనాన్స్ కన్సల్టెంట్ అరుణ, సామాజిక ఆరోగ్య అధికారులు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు , ప్రొజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ సాహిత్య జయరాం

వరల్డ్ న్యుమోనియా డే పై మెడికవర్‌లో అవగాహన

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

వరల్డ్ న్యుమోనియా డే సందర్భంగా మెడికవర్ హాస్పిటల్, కర్నూలులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు న్యూమోనియా వ్యాధి కారణాలు, నివారణ మార్గాలు , సమయానికి చికిత్స పొందడం దాని ప్రాముఖ్యతను వివరించారు. పాల్మనాలజిస్టు డాక్టర్ సువర్ణ లక్ష్మి కల్లి మాట్లాడారు. ఆమె మాటల్లో: 'న్యూమోనియా శ్వాసకోశ సంబంధిత తీవ్రమైన వ్యాధి. చిన్న పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు ఈ వ్యాధికి ఎక్కువగా గురయ్యే అవకాశం ఉంది. టీకాలు, ఆరోగ్యకర జీవనశైలి, పర్యావరణ పరిశుభ్రత ద్వారా న్యూమోనియాను నివారించవచ్చు. డాక్టర్ కె సిందూర రెడ్డి వివరాల ప్రకారం...పిల్లల్లో న్యూమోనియా ఒక ప్రధాన ఆరోగ్య సమస్య ప్రారంభ దశలో గుర్తించి సరైన వైద్యం చేయడం ద్వారా తీవ్రమైన పరిస్థితులను నివారించవచ్చు. తల్లిదండ్రులు చిన్నారుల్లో దగ్గు, జ్వరం, శ్వాసలో ఇబ్బంది వంటి లక్షణాలను గమనించిన వెంటనే వైద్యులను సంప్రదించాలి. డాక్టర్ వై. గణేష్ , డాక్టర్ అనుషా న్యూమోనియాకు నివారణ మార్గాలు సూచించారు. క్లస్టర్ హెడ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మెడికవర్ హాస్పిటల్ ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంపు కోసం ఎల్లప్పుడూ కషి చేస్తోందన్నారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ప్రజల్లో వ్యాధి నిరోధకతకు దోహదపడతాయని పేర్కొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

మహిళల భద్రత కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన శక్తి యాప్, శక్తి వాట్సాప్ నంబర్ల పై పాఠశాలలు, కళాశాలల్లో జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్ల అధికారులు శక్తి టీం బందాలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, విద్యార్థిణులకు , మహిళలకు వాటి సేవలను వివరిస్తున్నారని జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్ తెలిపారు. జిల్లా ఎస్పి ఆదేశాలతో మహిళా పోలీసు స్టేషన్ డిఎస్పి ఉపేంద్ర బాబు పర్యవేక్షణలో శక్తి టీంబృందాలు మహిళలకు, బాలికలకు పాఠశాల, కళాశాలలో విద్యార్థినిలకు శక్తి యాప్, సైబర్ నేరాలు , గుడ్ టచ్ అండ్ బ్యాడ్ టచ్, పోక్సో చట్టాలు, ఈవ్ టీజింగ్‌లపై విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో శక్తి టీం బృందాలు జన సంచారం ఉన్న ప్రాంతాలతో పాటు, పలు పాఠశాలల్లో విద్యార్థులకు డయల్ 112, డయల్ 100, 1098, 1930, శక్తి యాప్ , మహిళలు అత్యవసర సమయాల్లో నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు శక్తి" వాట్సప్ 7993485111 నెంబర్ ను మహిళలు, చిన్నారుల భద్రత కోసం సేవ్ చేసుకోవాలన్నారు. ఎక్కడైనా గంజాయి , డ్రగ్స్, మాదకద్రవ్యాల సేవించడం చూసినా విక్రయాలు, వినియోగం గురించి సమాచారం తెలిస్తే ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972 కు అందించాలన్నారు. విద్యార్థినులకు గుడ్ టచ్ అండ్ బ్యాడ్ టచ్ మధ్య తేడా, ఈవ్ టీజింగ్, ప్రేమ పేరుతో మోసాలు , మహిళలపై జరిగే నేరాల పై చట్టాల పై అవగాహన కల్పించారు. 2025 జనవరి నెల నుండి ఈనెల 12 వరకు శక్తి యాప్‌ను జిల్లాలో 19,251 మంది డౌన్లోడ్ చేసుకున్నారని జిల్లా ఎస్పి తెలిపారు.

గ్రంథాలయ వారోత్సవాల గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

జిల్లా కలెక్టర్ కార్యాలయం జెసి చాంబరులో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల గోడ పత్రిక , కార్యచరణ ప్రణాళిక పత్రాన్ని జాయింట్ కలెక్టర్ నూరుల్‌ఖమర్ బుధవారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్చార్జి కార్యదర్శి వి. పెద్దక్క, డిప్యూటీ కలెక్టర్ ప్రసన్న లక్ష్మి , సహాయ గ్రంథపాలకులు వజ్రాల. గోవిందరెడ్డి,లైబ్రేరియన్ ఎస్. బాష, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ఓర్వకల్లు మండల అధ్యక్షుడిగా నాగిరెడ్డి ప్రమాణం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఓర్వకల్ టిడిపి మండల అధ్యక్షుడిగా బ్రాహ్మణపల్లి నాగిరెడ్డి బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. కర్నూలు నగరంలో జరిగిన ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో పాణ్యం నియోజకవర్గ టిడిపి నూతన క్లస్టర్ బూతు విద్యార్థులు , మండల అధ్యక్షుల ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే గౌరుచరితరెడ్డి నూతనంగా ఎంపికైన వారిని అభినందించారు. మండల అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన నాగిరెడ్డిని మండలంలోని పలు గ్రామాలకు చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు.

గోల్డ్‌మెడల్ సాధించిన షేక్ ఇర్ఫాన్ బాబాకు అభినందన

ప్రజాశక్తి- వెల్దుర్తి

కష్టపడితే సాధ్యం కానిది ఏదీ లేదని నిరూపించాడు వెల్దుర్తి మండల కేంద్రానికి చెందిన యువకుడు షేక్ ఇర్ఫాన్‌బాబా. మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన ఇర్ఫాన్ తన చదువుపై అంకితభావం, పట్టుదలతో ముందుకు సాగి రాయలసీమ యూనివర్సిటీ నుండి ఎంఎస్‌సి కంప్యూటర్ సైన్స్‌లో గోల్డ్ మెడల్ సాధించాడు. రాయలసీమ విశ్వవిద్యాలయం నాల్గవ స్నాతకోత్సవం రాష్ట్ర గవర్నర్ ఛాన్సలర్ అబ్దుల్ నజీర్ చేతుల మీద గోల్డ్ మెడల్ అందుకున్నారు. పీజీ పట్టా సర్టిఫికెట్ అందుకుని తన తల్లిదండ్రులు హసీనా, ఫరీదాబాబాల కల నెరవేర్చాడు.వెల్దుర్తిలోని విద్యానికేతన్, జెడ్పీ హైస్కూల్, ఎమ్మిగనూరు పాఠశాలల్లో ప్రాథమిక విద్యను పూర్తి చేసిన ఇర్ఫాన్, డోన్‌లోని వెంకటేశ్వర కాలేజీలో ఇంటర్మీడియట్, కర్నూలు శంకరాస్ కాలేజీలో బిఎస్‌సి డిగ్రీ పూర్తి చేశాడు. తర్వాత రాయలసీమ యూనివర్సిటీలో 8.5 గ్రేడ్ పాయింట్లతో ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్‌లో పీజీ పూర్తి చేశాడు. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న ఇర్ఫాన్ విద్యా ప్రస్థానం పట్టుదల, శ్రమ, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో సాధించిన విజయగాథగా నిలిచింది.ఇర్ఫాన్ గోల్డ్ మెడల్ సాధించిన విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు, వెల్దుర్తి ప్రజలు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

మరుగుదొడ్ల సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

గుట్టపాడు గ్రామంలో ఎస్‌సి కాలనీలో నెలకొన్న మరుగుదొడ్ల సమస్యను పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి బి.నాగన్న డిమాండ్ చేశారు. బుధవారం ఓర్వకల్లు మండలం గుట్టపాడు గ్రామంలో మండల కార్యదర్శి బి నాగన్న మండల నాయకులు రామకృష్ణ స్థానికులతో కలిసి పర్యటించారు. ఆయన మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా ఎస్సీ కాలనీలో మరుగుదొడ్లు లేక మహిళలు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గ్రామంలో సిసి రోడ్లు, మురుగు కాలువలను కూడా నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సుజన, సుంకులమ్మ, దానమ్మ, పుల్లమ్మ, జయమ్మ, వెంకటమ్మ, స్థానికులు పాల్గొన్నారు.

గవర్నర్‌కు పూలబొకే ఇస్తున్న మంత్రి టిజి.ఎమ్మెల్యేలు దస్తగిరి, గౌరుచరిత

రాష్ట్ర గవర్నర్‌కు ఆత్మీయ స్వాగతం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లా పర్యటనలో భాగంగా ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు వచ్చిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు బుధవారం ప్రజా ప్రతినిధులు ఆత్మీయ స్వాగతం పలికారు. విజయవాడ ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ నుండి ప్రత్యేక విమానంలో బయలుదేరి కర్నూలు ఎయిర్పోర్ట్ కు ఉదయం 11 గంటలకు వచ్చిన గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి.భరత్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి, జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్, పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి లు కర్నూలులో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ కర్నూలు ఎయిర్‌పోర్టునుంచి రాయలసీమ యూనివర్సిటీకి బయలుదేరారు.



వైఎస్.జగన్‌ను కలిసిన కేదార్ నాథ్

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎంఎ.హఫీజ్‌ఖాన్ ఆధ్వర్యంలో వైసిపి సేవాదళ్ కర్నూలు జిల్లా అధ్యక్షులు, కేదార్ నాథ్ బుధవారం కలిశారు. అమరావతి తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో హఫీజ్ ఖాన్ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి కేదార్ నాథ్ మర్యాదపూర్వకంగా కలసి పూల బొకే అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్‌సిలు ఎదుర్కొంటున్న విద్య, ఉపాధి, ఆర్థిక , సామాజిక సమస్యలు, పేద కుటుంబాల పరిస్థితి, యువతకు అవకాశాల లోపం వంటి అంశాలపై విస్తృతంగా ఆయనతో చర్చించారు.స్‌సిల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు.

రాష్ట్రస్థాయి పత్తి రైతుల సమ్మేళనం జయప్రదం చేయండి

-కోడుమూరులో జీపు ప్రచార జాత

ప్రజాశక్తి-కోడుమూరు

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో నవంబర్ 18,19 తేదీలలో కర్నూలు జిల్లా, ఆదోని పట్టణంలోని ఎమ్మిగనూరు రోడ్డులోని ఆర్ట్స్ కాలేజీ సమీపంలోని రోషన్ గార్డెన్స్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పత్తి రైతుల సమ్మేళనానికి రైతులందరూ తరలిరావాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నాగేంద్రయ్య, జిల్లా కార్యదర్శి పంపన్న గౌడ్ కోరారు. రాష్ట్రస్థాయి పత్తి రైతుల సమ్మేళనం జయప్రదం చేయాలని కోరుతూ చేపట్టిన ప్రచార **జీపుజాత** బుధవారం కోడుమూరు పట్టణానికి చేరుకుంది. ప్రచార జీపు జాతకు సిపిఐ మండల కార్యదర్శి రాజు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు,కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. జిల్లాలో సుమారు 6లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారని అయితే రైతులు ఎకరాకు రూ.80వేలు పెట్టుబడి కింద ఖర్చు చేశారని గుర్తు చేశారు. కానీ అధిక వర్షాల ప్రభావం వల్ల జిల్లాలో పత్తి పంట పూర్తిగా దెబ్బతిందని పేర్కొన్నారు. పత్తి తోపాటు జిల్లాలో ఉల్లి,కంది, టమోటా, వేరుశనగ, మిరప వంటి తదితర పంటలు సాగు చేశారని, అధిక వర్షాల కారణంగా అన్ని పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని చెప్పారు. సిసిఐ ద్వారా కొనుగోలు చేసే పత్తి పంటకు క్వింటాలు రూ.12వేల మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర స్థాయిపత్తిరైతు సమ్మేళనానికి రాష్ట్ర, జాతీయ నాయకులు హాజరవుతారని తెలిపారు